## రాజశ్యామల యాగానికి ఏర్పాట్లు


యాగశాల

**నారాయణఖేడ్:** పట్టణంలో 18వ తేదీ నుంచి నిర్వహించనున్న రాజశ్యామల యాగం నిర్వహణకు లలిత వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు మలమంచి మోహన్‌జోషి పర్యవేక్షణలో రాజశ్యామల యాగం, మహారుద్ర సహిత శతచండీయాగపురస్సర చతుర్వేద స్వాహాకార సుదర్శన మహాయాగం నిర్వహించనున్నారు. దీంతోపాటు కార్తీక దీపోత్సవం, అయ్యప్ప స్వామి పడిపూజ, వెంకటేశ్వర కల్యాణం, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు పట్టణ శివారులోని దుర్గాభవానీ ఆలయ సమీపంలో ఏర్పాట్లు చేసినట్లు మోహన్ జోషి తెలిపారు. పీఠాధిపతులు, వేద పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొని ప్రవచనాలు అందించనున్నారు.

## బీజేపీకి గడీల రాజీనామా


రాజీనామా లేఖను చూపుతున్న శ్రీకాంత్ గౌడ్

**పటాన్‌చెరు టౌన్:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి షాక్ తగిలింది. పార్టీ నిర్ణయాలతో అసంతృప్తితో ఉన్న బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ గురువారం పార్టీకి గుడ్ బై చెప్పారు. తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపారు. 2019లో బీజేపీలో చేరి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసినా తనకు సరైన గుర్తింపు లభించలేదన్నారు. తాను అన్ని విధాల నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలో పార్టీ ఎవరి అభిప్రాయాలు సేకరించకుండా అభ్యర్థిని ప్రకటించిందన్నారు. కార్యకర్తలు, అభిమానుల మనోభావాలను గౌరవిస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

# భెల్‌ను కాపాడింది కేసీఆరే

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- గూడెంకు మద్దతు ప్రకటించిన కార్మిక సంఘాలు
- 23న పటాన్‌చెరులో సీఎం కేసీఆర్ బహిరంగ సభ

**పటాన్‌చెరు:** దేశంలో 80 శాతం ఉన్న కార్మిక లోకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పెనుముప్పుగా మారుతున్నాయని, 60 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ పారిశ్రామిక రంగాన్ని కుదేలు చేసిందని, కార్మిక రంగానికి సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలుస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో 2 లక్షలకు పైగా కార్మికులు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారన్నారు. వారి ఆర్థిక అభ్యున్నతికి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటున్నామని తెలిపారు. దేశానికి ఖ్యాతి తెచ్చిన బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ పరిశ్రమలకు కేంద్రం వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేయడంతో పాటు వాటికి సంబంధించిన ఆస్తులను ప్రైవేటుపరం చేస్తోందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహామండలి మాజీ చైర్మన్ రామ్మోహన్ రావు, టీవీ రావు, నర్ర భిక్షపతి, వరప్రసాద్ రెడ్డి, దామోదర్ రెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, అంజయ్య పాల్గొన్నారు.

### జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని పటాన్‌చెరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి రామచంద్రాపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు డివిజన్‌లను రూ.కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. తాగునీటి సమస్యతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు డివిజన్లలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తోందన్నారు. తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

### అణగారిన వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే

**పటాన్‌చెరు:** పోరాడి సాధించుకున్న తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతీపల్లె అభివృద్ధి పథంలో పయనిస్తోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30న జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణ, ఉపేందర్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.


కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

### సంక్షేమాన్ని చూసి పట్టం కట్టండి

**పటాన్‌చెరు టౌన్:** సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు విజయభాస్కర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని పోచమ్మ బస్తీలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

### అభివృద్ధి ప్రదాతకే మా మద్దతు

**పటాన్‌చెరు టౌన్:** ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తూ, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న పటాన్‌చెరు అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి పట్టణంలోని చైతన్య కాలనీ, అంబేద్కర్ యువజన సేవా సమితి సభ్యులు ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు. గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని ముందుకు సాగుతుంటే, ప్రతిపక్ష పార్టీలు నేడు అభివృద్ధి చేస్తామంటూ ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు.

### బీఆర్ఎస్ నేతల విస్తృత ప్రచారం

**జిన్నారం(పటాన్‌చెరు):** మండలంలోని ఊట్ల, సోలక్‌పల్లి, జిన్నారం గ్రామాలతో పాటు గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఊట్ల గ్రామంలో నిర్వహిస్తున్న ప్రచారంలో పాల్గొన్న జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు


ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న చైతన్య కాలనీ, అంబేద్కర్ యువజన సేవా సమితి సభ్యులు

## క్లుప్తంగా

### భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన


వీరభద్ర స్వామి

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం గ్రామంలోగల భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం లక్షబిల్వార్చన నిర్వహించారు. దేవాలయ ఈఓ శశిధర్, నిర్వాహకుడు సోమయ్యల ఆధ్వర్యంలో పత్రితో స్వామివారికి అర్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. కార్తీక మాసం పురస్కరించుకొని దేవాలయంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఈఓ తెలిపారు.

### మంత్రికి అల్పాహార విందు


అల్పాహారం చేస్తున్న మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గాలి అనిల్ కుమార్ ఇంటికి మంత్రి హరీశ్ రావు గురువారం ఉదయం విచ్చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ ఆయనకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి మంత్రి నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న సీఎం సభకు బయలుదేరి వెళ్లారు. మంత్రి వెంట ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి ఉన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు

**జిన్నారం(పటాన్‌చెరు):** జిన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, యువకులు గురువారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని సుధారాణి సూచించారు. కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం స్వాధీనం


మద్యాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

**జహీరాబాద్:** అక్రమంగా నిల్వచేసిన మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మొగుడంపల్లి మండలంలోని మాడ్గి వద్ద 65వ జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో 60 లీటర్ల గోవా మద్యం సీజ్ చేశారు. అలాగే ఝరాసంగం మండలంలోని టోప్యానాయక్, రాంచందర్ నాయక్ తండాల్లో జరిపిన దాడుల్లో 4,200 లీటర్ల ఎఫ్‌జే వాష్, 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని పారబోసినట్లు తెలిపారు. తనిఖీల్లో సీఐ మోహన్‌కుమార్, ఎస్ఐలు రమేష్, గిరి, అంజయ్య, పృథ్వీరాజ్, అనిల్, పోలీసులు పాల్గొన్నారు.

# సోనియా వల్లే తెలంగాణ వచ్చింది


హుగ్గెల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్


అల్గోల్‌లో ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్

- కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

**జహీరాబాద్:** కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని హుగ్గెల్లి, హుగ్గెల్లి తండా, అల్గోల్, డిడిగి, కొత్తూర్(బి), బుర్దిపాడ్, తూంకుంట, బూచనెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకుల ఆత్మబలిదానాలతో చలించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని, కేసీఆర్ దొంగ దీక్ష వల్ల రాలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం కోసం తన మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాను గెలిచిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపడతానని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. ప్రచారంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, కాంగ్రెస్ నాయకులు రాములు, నర్సింహారెడ్డి, భీమయ్య, రాములు, జ్యోతి మోహన్, స్వరూప, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గ్యారంటీలు పక్కాగా అమలు

**ఝరాసంగం(జహీరాబాద్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ అన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ తరఫున గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేసే కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రశేఖర్ సతీమణి ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రమీల

**జహీరాబాద్:** జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏ.చంద్రశేఖర్ సతీమణి ప్రమీల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. గురువారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రచారంలో మాజీ కౌన్సిలర్ రాజశేఖర్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# ఏకాగ్రతతో వాహనాలు నడపండి


నారాయణఖేడ్: పురస్కారం అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

**నారాయణఖేడ్:** డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడపాలని నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్టోబర్‌కు సంబంధించి ఆర్టీసీ డిపోలోని అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను సీఐ అందజేశారు. 26 ఏళ్ల విధినిర్వహణలో ఒక్క ప్రమాదం జరగకుండా విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ షేక్ సయీద్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, అసిస్టెంట్ మేనేజరు నర్సింహులు, మెకానికల్ ఇంజనీరు దశరథ్‌రావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్లకు పురస్కారాలు

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఇంధన పొదుపుతో పాటు విధుల్లో నిబద్ధత పాటించే డ్రైవర్లను సత్కరించి ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవేయడం ఆర్టీసీ ఘనత అన్నారు. వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రతా నిబంధనల్ని పాటించాలని సూచించారు. టీఎస్ ఆర్టీసీ ప్రమాద రహిత ప్రయాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డిప్యూటీ రీజనల్ మేనేజర్ దైవాదీనం పాల్గొన్నారు.

## మహిళల రక్షణే లక్ష్యం

**సదాశివపేట(సంగారెడ్డి):** హింసల నుంచి మహిళలను రక్షించడమే సఖీ సెంటర్ ప్రధాన లక్ష్యమని సంగారెడ్డి సఖీ వన్ స్టాప్ సెంటర్ సమన్వయ కర్త పవనరేఖ పేర్కొన్నారు. గురువారం సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో స్త్రీ శిశు సంక్షేమ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కట్టుబట్టలతో ఇంటి నుంచి బయటకి వచ్చిన బాధిత మహిళలకు తాత్కాలిక వసతి, వైద్యసేవలు, వారి తరఫున కేసులు నమోదు, పరిహారం, ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు.


స్త్రీ, శిశు సంక్షేమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

**సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):** సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని సంగారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులిమామిడి రాజు ఓటర్లను కోరారు. గురువారం మండల పరిధిలోని పెద్దాపూర్, నందికండి, గొల్లగూడెం తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలలో పాల్గొననున్న విద్యార్థులు

**సంగారెడ్డి అర్బన్:** మంగళయాన్, చంద్రయాన్ 1, 2 ప్రాజెక్టుల స్ఫూర్తితో సంగారెడ్డి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాసా నిర్వహిస్తున్న స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ఏటా పాల్గొని విజయాలను సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ పాండురంగం గురువారం తెలిపారు. విద్యార్థులు 2023–24 సంవత్సరానికి నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో పాల్గొనేవారికి నాసాకు సంబంధించిన కిట్లను బహూకరించారు.

# ఓటుహక్కుపై అవగాహన


ముగ్గులను పరిశీలిస్తున్న సీడీపీఓ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ తిరుపతి

**జోగిపేట (అందోల్):** ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. గురువారం ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి ఆఫీస్ స్టాఫ్ సాయి ప్రణవి, రెండో బహుమతి అంగన్ వాడీ టీచర్ హిమబిందు, మూడో బహుమతి మహిళా సమాఖ్య ఆర్పీ లక్ష్మీ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నారాయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్, మెప్మా టీఎంసీ భిక్షపతి గౌడ్, మహిళ సమాఖ్య ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో రాజ్యాంగ ఫలాలు

- మాజీ ఎంపీ సీతారాం నాయక్

**జహీరాబాద్:** సీఎం కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు రాజ్యాంగ ఫలాలు అందుతున్నాయని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. గురువారం జహీరాబాద్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ వల్లే తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయన్నారు. చీకటిలో ఉన్న తమకు 64 నియోజకవర్గాల్లో మేలు చేకూరు తోందన్నారు. అందుకే మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గిరిజన బంధు ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ సభ్యుడు శంకర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న చంద్రారెడ్డి

- కౌన్సిలర్ చంద్రారెడ్డి

**జిన్నారం(పటాన్‌చెరు):** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని మాఅంబి మహిళా సేవా సమితి వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మా అంబి మహిళా సేవాసమితి ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళల సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం ఉంటుందన్నారు.

# ఓటుహక్కు వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**నారాయణఖేడ్:** ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడం కోసం నారాయణఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. కళాకారులు పాటల ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపుమల్లారెడ్డి, మేనేజరు వెంకట శివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీఎస్పీలో చేరికలు

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలోగల వడ్డెర కులస్తులు గురువారం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా బీఎస్పీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నీలం మధు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతు ఇస్తూ ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. తనను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు.

## బ్యాంకులో అగ్నిప్రమాదం

**సంగారెడ్డి టౌన్:** షార్ట్ సర్క్యూట్‌తో బ్యాంకులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన సంగారెడ్డిలో గురువారం జరిగింది. సంగారెడ్డి టౌన్ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని యూకో బ్యాంకులో మేనేజర్ కేబిన్‌లో ఏసీ నుంచి పొగలు రావడాన్ని గమనించిన సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బ్యాంకుకు చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో మేనేజర్ కేబిన్‌లోని పత్రాలు, ఫర్నిచర్ కాలిపోయాయని కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.